క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 11 కేవీ ములుమూడి బస్టాండ్ ఫీడర్‌లో నూతనంగా స్తంభాలను ఏర్పాటు చేయనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల వీధి, సుందరగిరివారి వీధి, వేముగుంటవారి వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం మూడు వరకు సరఫరా ఉండదని చెప్పారు.

తక్కువ ధరకే ఏసీల పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): తక్కువ ధరకే ఏసీలను ఇస్తామంటూ మోసగించిన వ్యక్తిపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న జెండా వీధికి చెందిన జాకీర్‌కు ఆన్‌లైన్లో దుర్గానాయుడు అనే వ్యక్తి పరిచయమయ్యారు. రెండు నెలలు వాడిన ఏసీలను తక్కువ ధరకే ఇస్తామని నమ్మబలికారు. దీంతో ఐదు ఏసీలకు సంబంధించి రూ.65 వేలను ఫోన్‌పే ద్వారా జాకీర్ ఈ నెల ఆరో తేదీన పంపారు. కొద్దిసేపటి అనంతరం రూ.మూడు వేలను దుర్గానాయుడు తిరిగి పంపారు. మిగిలిన మొత్తాన్ని మళ్లీ పంపుతానని.. ఏసీలను షోరూమ్‌కు వెళ్లి తీసుకోవాలని జాకీర్‌కు చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన జాకీర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బుజబుజనెల్లూరులోని సీఏఏ క్రీడా మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సింహపురి ప్రీమియర్ లీగ్ టీ – 20 క్రికెట్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. కావలి సన్‌రైజర్స్, నెల్లూరు రూరల్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో, కావలి జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టింది. నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు రూరల్ జట్టు 19.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. క్రీడాకారుడు అశ్విన్ హెబ్బార్ 99 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను దక్కించుకున్నారు.


• రెండో మ్యాచ్‌లో ఆత్మకూరు రేంజర్స్, సర్వేపల్లి సూపర్‌జైంట్స్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు రేంజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 126 పరుగులు సాధించింది. అనంతరం బరిలోకి దిగిన సర్వేపల్లి జైంట్స్ జట్టు 16 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఎన్డీసీఏ సంయుక్త కార్యదర్శి మునిగిరీష్, కేర్‌టేకర్ శ్రీనివాసరెడ్డి, ఏసీఏ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, వంశీకుమార్, శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

22 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు



నెల్లూరు (పొగతోట): మహిళలు, శిశు అభివృద్ధి కోసం పౌష్టికాహార పక్షోత్సవాలను ఈ నెల 22 వరకు నిర్వహించనున్నామని సీడీపీఓ లక్ష్మీదేవి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలను నగరంలోని ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. సూపర్‌వైజర్లు స్వరూప, లక్ష్మీరాజ్యం, కవిత తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం జాతీయ రహదారి పక్కన గల అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. కల్యాణాన్ని భక్తులు తిలకించి కానుకలను సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకుడు మోపూరు కోదండరామిరెడ్డి పర్యవేక్షించారు.

వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన అవసరం

కొడవలూరు: వెయ్యి రోజుల సంరక్షణపై గర్భిణులు, బాలింతలకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. మండలంలోని వెంకన్నపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. వెయ్యి రోజుల పాటు ఎలాంటి ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యవంతులుగా ఉంటారో వివరించారు. పోషక విలువలున్న ఆహారాన్ని ప్రదర్శించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, జయశ్రీ, స్వర్ణలత పాల్గొన్నారు.

రాకపోకలంటేనే హడల్

• రోడ్లపై యథేచ్ఛగా పశువుల సంచారం
• వాహనదారుల అవస్థ
• తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
• పట్టించుకోని అధికారులు



మైపాడు రోడ్డుపై సంచరిస్తున్న గోవులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని రహదారులు, ప్రధాన రోడ్లపై పశువుల సంచారం నానాటికీ అధికమవుతోంది. గోవులు, ఎద్దులు, గేదెలు అడ్డొస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ తంతు నిత్యం జరుగుతున్నా, తూతూమంత్రపు చర్యలకే కార్పొరేషన్ అధికారులు పరిమితమవుతున్నారు.

యజమానుల నిర్లక్ష్యం

రోడ్లపై సంచరించే గోవులు, ఎద్దులను నగరపాలక సంస్థ అధికారులు పట్టుకొని వాటిని గోశాలలకు తరలిస్తున్నారు. అయినా కొందరు నిర్వాహకులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. మరోవైపు ఇస్కాన్ సిటీ, మినీబైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గేదెలను నిత్యం తోలుకెళ్తూ ట్రాఫిక్ స్తంభించేందుకు యజమానులు కారణమవుతున్నారు. దూడలను కొందరు రూ.రెండు వేల చొప్పున కొనుగోలు నగరంలో వదిలేస్తూ, అవి పెద్దవయ్యాక రూ.20 వేలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల, మూత్ర విసర్జనతో రోడ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

తీవ్రంగా సమస్య

నగరంలోని జీఎన్టీ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, పొదలకూరు రోడ్డు, మైపాడు రోడ్లలో మూగజీవుల సంచారం అధికమవుతోంది. గోవులు, లేగదూడలు, పెంపుడు జంతువులను కొందరు గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్లపై సంచరిస్తున్న పశువులను గోశాలకు తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారులు స్పందించాలి



నగరంలో మూగజీవాలు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయి. ఆహారం, సేద తీర్చుకునేందుకు స్థలం లేక ప్రమాదాలకు గురవుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

– బ్రహ్మయ్య, నవాబుపేట

రోడ్లపై వదిలితే చర్యలు

నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్లపై పశువులను తిరగనీయొద్దని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ఇవి బయట తిరిగితే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. ప్రమాదాలూ జరుగుతున్నాయి. గోవులను తమ గృహ ప్రాంగణాల్లోనే యజమానులు ఉంచుకోవాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు.



– మదన్‌మోహన్, వెటర్నరీ వైద్యుడు

రోడ్లపై భవన నిర్మాణ సామగ్రిని ఉంచకూడదు



సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): రోడ్లపై భవన నిర్మాణ సామగ్రిని ఉంచకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని 29వ డివిజన్లో గల మహాత్మాగాంధీనగర్, సుభాష్ చంద్రబోస్‌నగర్, రామచంద్రారెడ్డినగర్, వీఎమ్మార్‌నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ పార్కులో ప్రజలకు అవసరమైన వాకింగ్ ట్రాక్, టెన్నిస్ కోర్టు, వ్యాయామ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. డివిజన్లో కాలువల నిర్మాణం, ఇతర ఇంజినీరింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయనున్నామని వివరించారు. వీధి కుక్కల నియంత్రణ, రోడ్లపై పశువులు సంచరించకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్పొరేటర్ సత్తార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రతపై కన్నెర్ర

• పలువురికి జరిమానాల విధింపు



నెల్లూరు(బారకాసు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఎంహెచ్ఓ చైతన్య మంగళవారం పరిశీలించారు. 45వ డివిజన్లోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో రోడ్డుపై పూల వ్యాపారి వేసిన నారను తొలగించి జరిమానాను విధించాలని సూచించారు. హరనాథపురం సమీపంలో టమాటో ట్రక్ వ్యాపారులు రోడ్డును అపరిశుభ్రంగా మార్చడంతో జరిమానా విధించారు. మైపాడు రోడ్డులోని ఓ వైన్ షాపులో వాడుతున్న నిషేధిత డిస్పోజబుల్ గ్లాసెస్, వాటర్ ప్యాకెట్లను గమనించి వారికి రూ.20 వేల జరిమానాను విధించారు. స్థానిక సచివాలయ శానిటేషన్ సెక్రటరీకి మెమో జారీ చేశారు. జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద చెత్తను డంప్ చేయడాన్ని గమనించిన ఆయన వీటిని తొలగించాలని ఆదేశించారు. శానిటరీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సెక్రటరీలు ఝాన్సీ, ప్రదీప్, సురేష్, శైలజ, పద్మజ, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలి



పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా పారిశుధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. 19వ డివిజన్లోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, మహేశ్వరినగర్, పాత మున్సిపల్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. రోడ్లపై ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. కాలువలు ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్థానికులను కోరారు. అనుమతుల్లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే, వాటిని వెంటనే నిలిపేయాలని సూచించారు.

సైన్స్ సెంటర్‌కు రూ. 70 వేల విరాళం



నెల్లూరు(అర్బన్): జిల్లా సైన్స్ సెంటర్ అభివృద్ధికి తమ వంతు సాయంగా రూ.70 వేలను అపస్మా ఆధ్వర్యంలో ప్రకటించారు. ఈ క్రమంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కలెక్టర్ ఆనంద్‌కు ఆయన చాంబర్‌లో అసోసియేషన్ నేతలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడారు. విద్యాహక్కు చట్టం మేరకు పేద విద్యార్థులను నాలుగేళ్లుగా చదివిస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో రూ.ఆరు వేల చొప్పున, పట్టణ ప్రాంతాల్లో రూ.ఎనిమిది వేలను ఇస్తామని చెప్పినా, నేటికీ అందజేయలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అపస్మా కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, నేతలు వెంకటాద్రి, కృష్ణారావు, అభిషేక్‌రెడ్డి, డీఈఓ బాలాజీరావు, సైన్స్ సెంటర్ ఇన్‌చార్జి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ

నెల్లూరు(క్రైమ్): రెండు బైక్‌లను గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లిన ఘటనలపై కేసులను చిన్నబజార్ పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ట్రంక్‌రోడ్డులోని ఎమ్మీ అగ్రహారానికి చెందిన మెడికల్ రెప్రజెంటేటివ్ పట్టాభి శ్యామ్‌సుందర్‌రావు తన ఇంటి ముందు బైక్‌ను గతేడాది ఫిబ్రవరిలో నిలిపి ఉండగా, గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు.

• ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మీ సేవ కేంద్రం వద్ద వెంకటేశ్వరపురానికి చెందిన వెంకటసుబ్బయ్య గతేడాది సెప్టెంబర్‌లో బైక్‌ను నిలిపి పని నిమిత్తం బస్టాండ్‌లోకి వెళ్లారు. తిరిగొచ్చేసరికి కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్వేయర్లకు క్రీడా పోటీలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వేయర్లకు క్రీడా పోటీలను బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నామని విలేజ్ సర్వేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పోటీలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి కార్యాలయంలో బహుమతులను గురువారం అందజేయనున్నామని వివరించారు.

ఓటు హక్కు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు రూరల్: పద్దెనిమిదేళ్లు నిండిన వారు ఓటు హక్కు కలిగి ఉండేలా రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు కోరారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫారం – 6ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు గానూ డెత్ సర్టిఫికెట్లను అందించేలా కుటుంబసభ్యులను ప్రోత్సహించాలని కోరారు. టీడీపీ నుంచి రసూల్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కోటేశ్వరరావు, వివిధ పార్టీల నుంచి బాలసుధాకర్, శ్రీనివాస్, శ్రీరామ్ తదితరులు హాజరయ్యారు.

బీటీఏ నేతల నిరసన



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల్లో రోస్టర్ కమ్ రిజర్వేషన్‌ను పాటించాలని బీటీఏ రాష్ట్ర వ్యవస్థాపకుడు రమణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు దర్గామిట్టలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రం ఎదుట నిరసనను మంగళవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లను ఎత్తేసేందుకే మెరిట్ లిస్టులను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని ఆరోపించారు. దీన్ని రద్దు చేసి మెరిట్ కమ్ రిజర్వేషన్ విధానంలో సీనియార్టీ జాబితాను రూపొందించకపోతే రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, నేతలు మనోజ్‌కుమార్, లక్ష్మయ్య, చెంచయ్య, శ్రీనివాసులు, పవన్‌కుమార్, గీత, మల్లికార్జున, భాగ్యమ్మ, జయలక్ష్మి ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

పూలే జయంతిపై సన్నాహక సమావేశం నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలపై సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారి వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి బీసీ నేతలు, కార్యనిర్వాహకులు హాజరుకావాలని కోరారు.

గ్యాస్ ధరలు తగ్గించాలంటూ ఆందోళన



సుందరయ్యకాలనీలో..



డైకస్‌రోడ్డులో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలంటూ నిరసనను సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం చేపట్టారు. ఈ మేరకు 24, 32వ డివిజన్ల పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ, జాఫువానగర్, అంబేడ్కర్‌నగర్, డైకస్‌రోడ్డు, వెంగళరావునగర్ ప్రాంతాల్లో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసనను నిర్వహించారు. పార్టీ రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, కమిటీ నేత పెంచలనరసయ్య, షాహినాబేగం, సురేష్, శ్రీనివాసులు, ఇక్బాల్, అన్వర్, వెంకటరమణమ్మ, జ్యోతమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియళ్ల అందజేత



నెల్లూరు (టౌన్): పాలిసెట్ రాయనున్న విద్యార్థులకు మెటీరియళ్లను వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామారావు మాట్లాడారు. పాలిసెట్ రాసే విద్యార్థులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. అధ్యాపకులు సుజాత, మురళి, సోమశేఖర్ పాల్గొన్నారు

మేజర్ పార్కుల్లో కమ్యూనిటీ హాళ్లు



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు సిటీ: నగరంలోని పెద్ద పార్కుల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మించడంతో పాటు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులను వెంటనే చెల్లించాలని మంత్రి నారాయణ ఆదేశించారు. నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని తన క్యాంప్ కార్యాలయంలో కార్పొరేషన్, మెప్మా అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లు మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నగరంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న.. తల్లి లేదా తండ్రి లేని పిల్లలను గుర్తించాలని సూచించారు. వీఆర్ హైస్కూల్ పునరుద్ధరణ లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొన్నారు.

కుక్కల బెడద నియంత్రణకు చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా కుక్కల బెడద నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో రెండు లక్షల వీధి కుక్కలను గుర్తించామని, 200 రోజుల పాటు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రోజూ వెయ్యి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ భూముల జోలికెళ్లొద్దు

నగరంలోని ప్రభుత్వ భూముల జోలికెళ్లొద్దని టీడీపీ శ్రేణులకు మంత్రి నారాయణ సూచించారు. మెడికల్ కళాశాలలోని తన క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ నేతలతో సమావేశమైన ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో అవినీతికి ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేతలు మామిడాల మధు, తాళ్లపాక అనూరాధ, విజితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలస్వామి ఆలయంలో..



ఆంజనేయస్వామి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకాలంకారాల్లో కొలువైన దేవదేవేరులను భక్తులు దర్శించుకొని తన్మయత్వం చెందుతున్నారు.

➡ నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజారోహణాన్ని నిర్వహించారు. స్వామివారికి సింహవాహనసేవను రాత్రి జరిపారు. ఉభయకర్తలుగా పట్నం నాగేశ్వరరావు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

➡ ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో ధ్వజారోహణాన్ని నిర్వహించారు. స్వామివారు శేషవాహనంపై రాత్రి దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గోంట్రాలు సతీష్, లత, నంబూరు రవీంద్రకుమార్, జయమ్మ దంపతులు వ్యవహరించారు. ఈఓ దగ్గయ్య పర్యవేక్షించారు.

➡ సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు హంసవాహనంపై దర్శనమిచ్చారు. ఈఓ రఘురామయ్య పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధ్వజారోహణం, పేట ఉత్సవాన్ని నిర్వహించారు. శేషవాహనంపై స్వామివారి నగరోత్సవాన్ని వేడుకగా జరిపారు. ఉభయకర్తలుగా వేముల మల్లికార్జునరావు, వెంకటసులక్షణ దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు

➡ వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో కొలువైన దేవతామూర్తులు, సీతారామ, లక్ష్మణ, హనుమంతుడికి విశేష పూజలను నిర్వహించారు. తిరుమంజనం, అభిషేకం, ఊంజల్‌సేవ తదితరాలను జరిపారు. ఉభయకర్తలుగా శనగవరపు గణేష్ కుమార్, పొన్నలూరి వెంకటశేష పవన్‌కుమార్, ఇరగబోయిన శ్రీనివాసరావు దంపతులు వ్యవహరించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేష పూజలను నిర్వహించారు. శేషవాహనసేవను రాత్రి జరిపారు. ఉభయకర్తలుగా తాతా వెంకటరామకుమార్, వెంకటకిశోర్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ నిర్వాహకులు అమరా మోహన్‌రావు, తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్, స్వామి హనుమంతరావు తదితరులు పర్యవేక్షించారు.



మల్లేశ్వరస్వామి దేవస్థానంలో..



సీతారామస్వామి మందిరంలో..



త్యాగరాజస్వామి మందిరంలో..



కోదండరామస్వామి దేవస్థానంలో..